క్లుప్తంగా

బీరప్ప కల్యాణానికి గంగపూజ



విగ్రహాలను ఊరేగిస్తున్న యాదవులు

కల్హేర్(నారాయణఖేడ్): గొల్లకుర్మ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీరప్ప స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ మేరకు విగ్రహాలను చెరువు వద్దకు తరలించి గంగపూజ చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో గొల్లకుర్మ సంఘం నాయకులు సాయిగోండ, గంగదాస్, కేషిగోండ, మల్లుగోండ, మల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ



పడిపూజలో శివస్వాములు

జహీరాబాద్ టౌన్: మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో అశోక్‌స్వామి ఆధ్వర్యంలో శివస్వాములు పడిపూజ ఘనంగా నిర్వహించారు. మెట్లపై హారతి కర్పూరం వెలిగిస్తూ కన్నుల పండువగా సాగింది. శివలింగానికి రుద్రాభిషేకం, గణపతిపూజ, పుష్పాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి శివస్వాములు తరలివచ్చారు. భజన గీతాలు, శివ నామస్మరణతో గ్రామం మార్మోగింది. తెలంగాణ సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి పడిపూజలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి కొల్లూరుకు చెందిన నర్సింలు రూ.85 వేల విరాళం శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు దాతను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువత వెంకటేశం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మంద రమేష్, లింగం, బ్రహ్మేందర్, శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటాపాటలు అవసరం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

జహీరాబాద్ టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటాపాటలు అసరమని మోటివేషనల్ స్పీకర్లు కృష్ణ చైతన్య రెడ్డి, వంశీ కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ హైస్కూల్ 12వ వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసం నింపుతాయన్నారు. విద్యాప్రమాణాలు పెరగడానికి ఉపాధ్యాయుల కృషి తల్లిదండ్రుల తోడ్పాటు తప్పకుండా ఉండాలన్నారు. కన్నతల్లి, స్వగ్రామం ఎవరూ మరిచిపోలేరన్నారు. ఈ సందర్భంగా వారు కథల చెప్పి పిల్లలు, తల్లిదండ్రులకు మంచి సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బస్వరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు ఆంజనేయులు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్ కుమార్తె వివాహానికి ప్రముఖులు

పటాన్‌చెరు: కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కుమార్తె జాగృతి సాయి వివాహం శేరిలింగంపల్లి 106వ డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కుమారుడు రాగం అనిరుధ్ యాదవ్‌తో ఆదివారం హైదరాబాద్, కొండాపూర్‌లోని హైటెక్స్ జరిగింది. వివాహ వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



రైతులు ఇచ్చిన మట్టి నమూనాలు



పరీక్ష చేయడానికి ద్రావణం వేసి ఉంచిన మట్టి



పోషకాల పరీక్షకు వాడే రసాయనాలు

భూసార పరీక్షలు చేయించండి

రైతులు తమ పంట పొలాల్లో విరామం లేకుండా ప్రతీ సంవత్సరం ఏదో ఒక పంట వేస్తుంటారు. ఒక్కోసారి కొన్నేళ్ల పాటు పంట మార్పిడి జరగదు. పంట వ్యర్థాలను భూమిలోనే కాలుస్తుంటారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుంది. ఒక్కోసారి వర్షాకాలంలో వచ్చే వరదనీటి ప్రవాహంతో సైతం భూమిలో ఉండే పోషకాలు కొట్టుకుపోతాయి. దీనివల్ల రైతులు పంట దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రతీ రైతు కచ్చితంగా భూసార పరీక్ష కేంద్రంలో టెస్టులు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. టెస్ట్ చేయించుకోవటం వల్ల రైతు పొలంలో నత్రజని, పొటాషియం, భాస్వరం, సేంద్రియ కర్బనం, లవణాల శాతం ఎంత ఉందో అధికారులు తెలియజేస్తారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

క్రీడామైదానాలు లేక అవస్థలు!

- ముళ్లపొదల్లో ఆడుకుంటున్న యువకులు
- స్థలం కేటాయించాలని వినతి
- పట్టించుకోని ప్రభుత్వాలు



ఉస్మాన్‌నగర్‌లో ముళ్లపొదల మధ్య క్రికెట్ ఆడుతున్న యువకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మహానగరంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురంలో క్రీడామైదానాలు లేక యువత ఆటలకు దూరమవుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారు శ్మశానల్లో, ముళ్ల పొదల్లో ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక ఏళ్లుగా స్థానిక క్రీడాకారులు రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో క్రీడామైదానం కోసం భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. పాలకులు మారుతున్నా ప్రభుత్వం మాత్రం క్రీడామైదానం కోసం స్థలం కేటాయించడం లేదు.

ముళ్లపొదల్లో ఆటలు

మున్సిపల్ పరిధిలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. కానీ క్రీడామైదానాలు లేకపోవడంతో స్థానిక యువకులు ముళ్లపొదల్లో ఆడుకుంటున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో బహుళఅంతస్తుల భవనాలు నిర్మాణం జరుగుతుండడంతో వలస కార్మికులు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. వారు కూడా శని, ఆదివారాల్లో రోడ్లపై, ముళ్లపొదల్లో క్రికెట్ ఆడుకుంటున్నారు.

స్థలం కేటాయించండి..

క్రీడామైదానం కోసం స్థలం కేటాయించాలని స్థానిక యువత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. ఈ ప్రాంతాలకు చెందిన వందలాది ఎకరాల భూములను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్నాయి. నేడు ప్రభుత్వం క్రీడామైదానాలకు భూమిను కేటాయించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ క్రీడామైదానాలకు డిమాండ్

క్రీడామైదానాలు లేకపోవడంతో చాలా మంది ఉద్యోగులు ప్రైవేట్ క్రీడామైదానాల్లో డబ్బులు చెల్లించి ఆడుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో అనేక ప్రైవేట్ క్రీడామైదానాలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం క్రీడామైదానాలను అభివృద్ధి చేస్తే అన్ని వర్గాల ప్రజలు క్రీడల్లో రాణించే అవకాశం ఉంది.

క్రీడలకు దూరంగా ఉంటున్నాం



క్రికెట్ అంటే ప్రాణం గతంలో ఖేల్ పరిసరాల ఖాళీ స్థలాల్లో బాగా ఆడేవాళ్లం. యాజమాన్యం ఆడుకునే స్థలాల్లో మొక్కలు పెట్టడంతో క్రీడాలకు దూరంగా ఉంటున్నాం. బయట కూడా క్రీడామైదానాలు లేకపోవడంతో క్రీడలపై ఆసక్తి తగ్గింది.

– అల్తాఫ్, విద్యుత్‌నగర్ కాలనీ

మైదానాలను అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో క్రీడామైదానాలకు భూములను కేటాయించి.. అందులో అన్ని రకాల క్రీడామైదానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. లేనిపక్షంలో రానున్న రోజుల్లో యువత క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉంది.

– శేఖర్, రామచంద్రాపురం

శోభాయాత్రను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 19న శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించే శోభయాత్రను విజయవంతం చేయాలని వీరశివాజీ యువసేన సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం జయంతికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరశివాజీ సభ్యులు మాట్లాడుతూ... బుధవారం సా.4 గంటల నుంచి జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ దేవస్థానం నుంచి ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ప్రారంభమై పలు వీధుల మీదుగా మహంకాళి దేవస్థానం వద్ద ముగుస్తుందన్నారు. శోభయాత్రలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



బ్యాతోల్‌లో నీరులేక ఖాళీగా ఉన్న తొట్టి

పశువులకు నీరందని దుస్థితి

కంది(సంగారెడ్డి): ఎండాకాలంలో పశువులకు దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లోపం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మూగజీవాలకు నీరందని దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో ప్రణాళిక లేకుండా జనావాసాలకు దూరంగా నిర్మించడంతో పనికి రాకుండా పోయాయి. ప్రస్తుతం చాలా గ్రామాల్లో నీటి తొట్లు కూలిపోగా.. మరికొన్ని చోట్ల నీటి సరఫరా లేక శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజాధనం వృథా కావడమే కాకుండా పశువులకు నీటి సౌకర్యం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైన తొట్లకు మరమ్మతులు చేయించి పశువులకు నీటిసౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 31 సంవత్సరాల క్రితం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరువేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శివస్వాములు, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు విశాల్

సదాశివపేట (సంగారెడ్డి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని పట్టణ పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు విశాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టభద్రుల సమస్యల పరిష్కరించే అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. సదాశివపేట ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో స్థానిక పట్టభద్రులకు ఉపాధి అవకాశం కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, మధుకర్‌రెడ్డి, పరమాత్మ, విజయ్, సర్వర్‌పాష, సుధాకృష్ణ పాల్గొన్నారు.

భక్తుల సందడి



పటాన్‌చెరు టౌన్ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



న్యాల్‌కల్: సిద్ధి వినాయక ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో మేడాలమ్మ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ నల్లవల్లి అటవీ ప్రాంతంలో వెలసిన మేడాలమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఏటా ప్రత్యేక పూజలు నిర్వహించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ వ్యవస్థాపకులు సంజీవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, కృష్ణగౌడ్, నాయకులు, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు, నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఆర్‌వీఎంబీ అకాడమీ నిర్వాహకులు రవి అన్నారు. బెజ్జంకిలో ఆ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ క్రికెట్ ముగింపు సమావేశం ఆదివా రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. అనంతరం విన్నర్‌గా నిలిచిన గుండారం గ్రామ రిషి జట్టుకు రూ. 50వేలు, రన్నర్‌గా నిలిచిన గుగ్గిల్ల మూన్ స్టార్ జట్టుకు రూ.25వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్, మధు, ప్రశాంత్, నాయకులు, ఉపాసకు రాలు హరిప్రియ, లక్ష్మణ్, రూపేశ్, దేవయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గోమాతను పూజిస్తున్న మహిళలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మహీంద్రకాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గోపూజ చేశారు. ధ్వజారోహణం, స్వామివారికి 108 కలశాభిషేకం నిర్వహించారు. 17న రాయబారం(ఎదురుకోలు) మహోత్సవం. 18న శ్రీవారి శాంతి కల్యాణం, స్వామి శేషవాహనం ఊరేగింపు ఉంటుందన్నారు. 19న సుదర్శన హోమం, సాయంత్రం గరుడస్వామి ఊరేగింపు నిర్వహించనున్నారు. 22న ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, పూర్ణహుతి, చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షణలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.